విజృంభిస్తున్న విషజ్వరాలు


సిద్దవటం: సీహెచ్‌సీలో వైరల్ జ్వరంతో సెలైన్ ఎక్కించుకుంటున్న జ్వర పీడితులు


రాజంపేట: నియోజకవర్గ కేంద్రంలోని ప్రాంతీయ వైద్యశాలలో రోగులు

- రోజురోజుకూ పెరుగుతున్న వైరల్ ఫీవర్, దోమకాటు బాధితులు
- చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకు మంచాన పడుతున్న వైనం
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు పెడుతున్న జనం
- దోమల నివారణకు యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టేనా..?

రాయచోటి : జిల్లా కేంద్రమైన రాయచోటితోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. మలేరియా, డెంగీ వ్యాధుల ప్రభావం అంతగా లేకపోయినా వైరల్ జ్వరాలతో రోజురోజుకూ ప్రజలు హడలెత్తిపోతున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు వివిధ కార్యక్రమాలు చెబుతున్నప్పటికీ ప్రజలు శ్రద్ధ చూపకపోవడం వల్లనో లేదా క్షేత్రస్థాయి అధికారుల అలసత్వం వల్లనో దోమకాటు, వైరల్ ఫీవర్, విషజ్వరాలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అడపాదడపా వర్షాలు పడుతున్నాయన్న సంబరం కంటే జ్వరాలు సోకుతున్నాయనే ఆందోళనే ప్రజల్లో ఎక్కువగా కనబడుతోంది. జలుబు, దగ్గు, తీవ్ర జ్వరాలతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వద్ద జనం క్యూ కడుతున్నారు. ప్రగతి కార్యక్రమాలు చేపట్టి చాలా చోట్ల నీటి నిల్వలు, దోమల ఆవాస కేంద్రాలు లేకుండా చేస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం కనపడటం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో పెద్దమొత్తంలో వైరల్ ఫీవర్ బారినపడి చికిత్స పొందుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు తీవ్ర జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పితో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. మరికొందరు తీవ్ర జ్వరం, కఫంతో ఊపిరి తీసుకోవడానికి ఇబ్బందులు పడుతుండటంతో ఆయా ఆసుపత్రులలో ఇన్ పేషెంట్లుగా చేరి రోజుల తరబడి చికిత్సలు పొందుతున్నారు.

విజృంభిస్తున్న వైరల్, దోమకాటు వ్యాధులు

ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోవడం, ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను, పిచ్చిమొక్కలు, నీటినిల్వలపై దృష్టి సారించకపోవడంతో రాయచోటి పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. మురుగునీటి నిల్వలు అధికమై దోమలు వృద్ధి చెంది పగలు రాత్రి అనే తేడా లేకుండా కుడుతూ కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

రోగులతో ఆసుపత్రులు కిటకిట

జిల్లా కేంద్రంలో విషజ్వరాలతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రజలు పరుగులు పెడుతుండటంతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ఈ విషజ్వరాలు అత్యధికంగా వెనుకబడిన ప్రాంతాలు, మారుమూల గ్రామాలు, మురికివాడల్లో సోకుతున్నట్లు తెలుస్తోంది. రాయచోటిలోని మేజర్ ఆసుపత్రిలో రోజుకు 700 నుంచి వెయ్యి మందికి పైగా ఓపీ ఉన్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సుకుమార్ చెప్పారు. పేద మధ్య తరగతి ప్రజలే అధికంగా జ్వరాల బారినపడి ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ఆర్థిక స్థోమత లేక వైద్యం కోసం స్థానికంగా ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు జిల్లా కేంద్ర ఆసుపత్రులకు తరలుతున్నారు.

దోమల నివారణపై కార్యాచరణ ప్రకటించేనా..?

ప్రస్తుతం మలేరియా, డెంగీ కేసులు తక్కువగా నమోదవుతున్నా సీజనల్ జ్వరాలు, విషజ్వరాలతో ప్రజలు మంచాన పడుతున్నారు. అయితే డెంగీ, మలేరియా జ్వరాలు అధికారిక లెక్కల ప్రకారం పదిలోపే కేసులు నమోదవుతున్నాయని చెబుతున్నప్పటికీ అనధికారికంగా అనేక ఆసుపత్రులలో 50కి పైగా దోమకాటు బాధితులు చికిత్సలు పొందుతున్నారు. దోమల సంతతి పెరిగిపోయి దోమకాటు బాధితుల ఎక్కువవుతున్నారు. మున్సిపాలిటీలో ఒకరిద్దరిని మాత్రమే దోమల నివారణ మందులు కొట్టేందుకు ఉపయోగిస్తుండటం.. ఇక గ్రామాల్లోనైతే నివారణ చర్యలు కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దోమల నివారణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలని అప్పుడే దోమకాటు బాధితుల సంఖ్య తగ్గుముఖం పట్టే అవకాశం ఉందనే వాదనలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.


సంబేపల్లె: పీహెచ్‌సిలో జ్వరపీడుతులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సుండుపల్లెలో పారిశుధ్యం.. అధ్వానం

సుండుపల్లె : మండలంలో పారిశుధ్య లోపంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాయచోటి – సుండుపల్లె ప్రధాన రహదారిలోని గుల్లావాండ్లపల్లె వద్ద మురికి నీరు ఎక్కువగా ఉండటంతో దోమలు, ఈగలకు నిలయాలుగా మారాయి. ఇళ్లలోని ప్రజలు దుర్వాసనతో అల్లాడిపోతున్నారు. చిన్నపాటి వర్షానికి సైతం నీరు నిల్వ ఉండటమే కాక దానిలో డ్రైనేజీ నీరు కలవడంతో ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. సుండుపల్లె టౌన్‌లో పోస్టాఫీస్ వీధిలో డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని గృహిణులు వాపోతున్నారు. పారిశుధ్య పనులు చేయడంలో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని డ్రైనేజీని నెలకి ఒకసారి కూడా శుభ్రం చేయడంలేదంటూ చెప్పారు. అధికారులు చర్యలు చేపట్టి పారిశుధ్యం మెరుగుపరిచి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

వైద్య పరీక్షలకు ప్రైవేటు సెంటర్‌లకే..

రాజంపేట : ప్రాంతీయ వైద్యశాలలో రోగులు రాక సీజన్‌లో రోజురోజుకు పెరుగుతోంది. రోజుకు వందల సంఖ్యలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వస్తున్న వారిలో అధికంగా వాంతులు, విరేచనాలతో పాటు జ్వరాల బారీన పడిన వారు ఆస్పత్రులకు వస్తున్న సంఖ్య చాల తక్కువగా ఉంది. అయితే రోగులకు సరైన వసతులు లేకపోవడం గమనార్హం. కాగా సీజన్‌లో జ్వరపీడితులతోపాటు ఇతర జబ్బులకు రక్తపరీక్షలకు చేసేందుకు సరైన రీతిలో పరికరాలు పనిచేయడంలేదు. దీంతో రోగులకు ప్రైవేటు ల్యాబ్‌లో రోగులకు పరీక్షలకు రెఫర్ చేస్తున్నారు. జ్వరపీడితుల విషయంపై సూపరిండెంట్ డా.పీవీఎన్‌రాజు మాట్లాడుతూ జ్వరాల బారీనపడినవారు తక్కువగానే వస్తున్నారన్నారు.

ప్రబలుతున్న మహమ్మారి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలో జ్వరాల మహమ్మారి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. మారిన వాతావరణ పరిస్థితులవల్ల వర్షాలు పడుతూ పట్టణంలో, గ్రామాలలో పారిశుధ్యం కుంటుపడటంతో జ్వరాలు అధికమయ్యాయి. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి ప్రతి నిత్యం పేద ప్రజలు జ్వరాలు విరేచనాలు ఇతర సమస్యలతో ఆశ్రయిస్తున్నారు. డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో నర్సులు రోగులకు చికిత్స చేస్తున్నారు. దీంతో ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. గ్రామాలలో పారిశుధ్యంపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో రోజురోజుకు జ్వరాలు అధికమవుతున్నాయి.

వాతావరణం మారడంతోనే జ్వరాలు

వాతావరణంలో మార్పులు రావడంతో ఇప్పుడు ఎక్కువగా జ్వరాలు ప్రబలుతున్నాయి. రోజువారీగా కాకుండా కాస్త ఎక్కువ మంది రోగులు వస్తున్నారు. రోజు 600–700 మందికి తగ్గకుండా రోగులు వస్తుంటారు. అయితే ఆదివారం, సోమవారం రోజుల్లో దీని సంఖ్య కాస్త ఎక్కువగా ఉంటోంది. ఒక్కో రోజు 1100 – 1200 మంది కూడా వస్తున్నారు. అయితే చాలా మందిలో సాధారణ జ్వరాలే కనిపిస్తున్నాయి. విష జ్వరాలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. ఇక విరేచనాలు అయితే నీటి కాలుష్యంతోనే వస్తుంటాయి. రోగులకు సిబ్బంది మెరుగైన సేవలు అందిస్తున్నారు. ప్రజలు జ్వరాలు దరిచేరకుండా జాగ్రత్తలు పాటించాలి. జ్వర లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ డేవిడ్ సుకుమార్, సూపరింటెండెంట్, రాయచోటి ఏరియా ఆస్పత్రి

ఆసుపత్రులకు పరిగెత్తాల్సి వస్తోంది



ఈ మధ్యకాలంలో కురుస్తున్న కొద్దిపాటి వర్షానికి దోమల బెడద ఎక్కువైపోయి జ్వరాలు వస్తున్నాయి. అప్పట్లో దోమల నివారణకు ప్రభుత్వం ఉచితంగా దోమతెరలు పంపిణీ చేసేది. గ్రామాలలో మందులు స్ప్రే చేసి దోమలు లేకుండా చేసేవారు. ప్రస్తుతం జ్వరాలు వస్తే లక్కిరెడ్డిపల్లె, రాయచోటి ఆసుపత్రులకు పరిగెత్తాల్సి వస్తోంది. దోమలు కరవడంతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలు వస్తున్నాయి. గ్రామాలలో మురుగునీరు లేకుండా చేసి దోమలకు మందులు స్ప్రే చేయించాలి. జ్వరాలు వచ్చి ప్రైవేట్ హాస్పిటల్లకు వెళితే వేల రూపాయలు ఖర్చు అవుతోంది.

– సి.వెంకటకృష్ణయ్య, ఈడిగపల్లి, లక్కిరెడ్డిపల్లె

వైద్యం అందిస్తున్నాం



ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. పీహెచ్‌సీకి మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి రోగులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను గుర్తించాం. అక్కడ దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు అన్ని చర్యలు అధికారులతో కలిసి చేపడుతున్నాం. ప్రజలు కూడా వారి ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. స్వీయ పరిశుభ్రతను పాటించాలి. కాచిన నీటిని తాగాలి. నీరసంగా ఉంటే వైద్యశాలకు వచ్చి వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, పీహెచ్‌సీ, సంబేపల్లె


రైల్వేకోడూరు అర్బన్ : రాఘవరాజపురం వద్ద పేరుకపోయిన నీరు


సుండుపల్లె: గుల్లావాండ్లపల్లి దగ్గర డ్రైనేజీ, వర్షపునీటితో ఇబ్బంది పడుతున్న వాహనదారులు


రాయచోటి జగదాంబ సెంటర్: పట్టణంలో చెత్తాచెదారంతో నిండిపోయిన మురికికాలువ

క్లుప్తంగా

శాకంబరీ అలంకరణలో నారసింహుడు


శాకంబరీ అలంకరణలో మూల మూర్తులు

రాయచోటి టౌన్ : పట్టణంలోని లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారికి విశేషమైన పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీ, ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు నిర్మించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో మంగళవారం ఉదయం స్వామివారికి, అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి రకరకాల కూరగాయలతో అలంకరణ చేశారు. అనంతరం భక్తుల దర్శన ఏర్పాట్లు చేశారు.

ఆంజనేయుడికి పూజలు


ప్రత్యేక అలంకారంలో గాండ్లవీధి అంజన్న

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని గాండ్లవీధిలో వెలసివున్న ఆంజనేయస్వామి ఆలయం, ఇరిగేషన్ కార్యాలయం, టోల్‌గేట్ వద్దనున్న ఆంజనేయస్వామి ఆలయాలలో మంగళవారం భక్తులు ఘనంగా పూజలు చేశారు. మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే భక్తులందరూ సహస్రనామాలతో అంజన్నకు ఆకుపూజ జరిపారు.

కుష్టు వ్యాధిని నిర్మూలిద్దాం


మాట్లాడుతున్న డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్

నందలూరు : కుష్టు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రభుత్వ వైద్యులు కార్తీక్ విశ్వనాథ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశలు, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు ఆయన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను ఇంటింటికి వెళ్లి గుర్తించే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. వ్యాధిగ్రస్తులను పీహెచ్‌సీకి రెఫర్ చేయాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటనారాయణ, సూపర్‌వైజర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీ ఉద్యోగి హఠాన్మరణం


లక్ష్మీకాంత్ (ఫైల్)

ఓబులవారిపల్లి (రైల్వేకోడూరు అర్బన్) : ఏపీఎండీసీ మంగంపేటలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న గునిపాటి లక్ష్మీకాంత్ (34) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మంచి భవిష్యత్తు ఉన్న లక్ష్మీకాంత్ చిన్న వయసులో మృతి చెందడం బంధువులు, స్నేహితులు, తోటి ఉద్యోగులు జీర్ణించుకోలేక ఉన్నారు. పలువురు సంతాపం ప్రకటించారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీఓ శశికళ

రాయచోటి అర్బన్ : రాయచోటి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సుండుపల్లె మండలం ఈడిగపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం సీడీపీఓ డి.శశికళ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని రిజిస్టర్‌లను, పిల్లల హాజరుపట్టికను, పరిశీలించారు. పిల్లలకు గర్భిణులకు సరైన పోషకాహారాన్ని అందిస్తున్నారా? లేదా? అంటూ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పిల్లలకు, గర్భిణులకు అందవలసిన ఆహారం, వస్తువులను సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలంటూ అంగనవాడీ కార్యకర్తకు సూచించారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

సిద్దవటం : పంచాయతీల పరిధిలో గ్రామ కార్యదర్శులు సర్పంచ్ అధ్యక్షతన వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరావు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ పంచాయతీలలో మురుగునీరు వెళ్లే కాలవల్లో అపరిశుభ్రత లేకుండా చూడాలన్నారు. లేదంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి ట్యాంకులు 15 రోజులకు ఒక్కసారి శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామాల్లోని గుంతలలో నీరు నిలువ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలని తెలియజేశారు.

మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలి

పుల్లంపేట : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) మండల కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ఎస్టీయూ మండల అధ్యక్షులు సయ్యద్ సత్తార్ హుస్సేన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు వెంటనే 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి నరేంద్ర మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను నూతన ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, అదే విధంగా ప్రభుత్వ పాఠశాల మనుగడకు జీఓ నెంబరు 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు బి.సిద్దయ్య, శివరామ ప్రసాద్, ఎం.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి నరేంద్ర

దోమల నిర్మూలనకు గంబూసియ చేపలు

సంబేపల్లె : సీజనల్ వ్యాధులు ప్రధానంగా దోమలు, ఈగలు ద్వారా వ్యాప్తి చెందుతాయని సంబేపల్లె వైద్యులు మధుసూదన్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డిలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పాండురాజులబండ ప్రాంతంలో నిల్వవున్న మురుగునీటిలో గంబూసియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వర్షాల వలన, ఇండ్ల నుంచి వచ్చే నీరు ఒకే చోట నిల్వ ఉండటంతో దోమలు అధికంగా వృద్ధి చెంది వ్యాధులు వ్యాపిస్తాయి. దోమల నిర్మూలనకు మురుగునీరు వున్న ప్రాంతాలలో ఈ చేపలను వదలడం జరిగిందన్నారు. ఈ రకం చేపలు దోమలు నీటిలో పెట్టిన లార్వాలను తినేయడంతో దోమలు అభివృద్ధి చెందవని చెప్పారు. ప్రజలు మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


మురుగునీటిలో గంబూసియా చేపలను వదులుతున్న వైద్యులు

పార్కును పరిశుభ్రంగా ఉంచండి

రాయచోటి అర్బన్ : పట్టణంలో ఎన్‌జీఓ కాలనీలోని పార్కును పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, రాష్ట్రమంత్రి సోదరుడు రాహుల్‌రెడ్డి అధికారులను కోరారు. మంగళవారం వారు మున్సిపల్ అధికారులతో కలసి 18వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని పార్కును వారు పరిశీలించారు. పార్కును పరిశుభ్రంగా ఉంచడం ద్వారా పిల్లలు ఆడుకునేలా చూడాలన్నారు. ముఖ్యంగా కాలనీ వాసుల సౌకర్యార్థం పార్కులో వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలంటూ సూచించారు. వార్డులోని ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చే సమస్యలను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు. పలు ప్రాంతాల్లో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంబాలను వెంటనే పక్కకు తొలగించడం ద్వారా ప్రజారవాణాకు ఆటంకం కలగకుండా చూడాలంటూ ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతోపాటు పలు ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొన్నారు.


పార్కును పరిశీలిస్తున్న కమిషనర్, రాహుల్‌రెడ్డి, అధికారులు

పీర్లకు పూలచాదర్‌ను సమర్పించిన పోలీసులు

చిన్నమండెం : మండల కేంద్రంలో జరిగే మొహర్రం ఉత్సవాలు జిల్లాలోనే కాక రాయలసీమలో ఎంతో ప్రఖ్యాతిగాంచినవి. ప్రతి యేటా మొహర్రం వేడుకలను చిన్నమండెంలో వైభవంగా జరుపుతారు. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం గంధపు పీర్లకు పోలీసులు పూలచాదర్‌ను సమర్పిస్తూ వస్తున్నారు. దీంతో ఈ యేడు రాయచోటి రూరల్ ఇన్‌చార్జ్ సీఐ భాస్కర్, చిన్నమండెం ఎస్‌ఐ రమేష్‌బాబులు గంధపు పీరుకు పూలచాదర్‌ను సమర్పించారు. అదే విధంగా బాసిక మహోత్సవ కార్యక్రమానికి, ఊరేగింపులో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇద్దరు సీఐలు, ఆరు మంది ఎస్‌ఐలు, 90 మంది పోలీసు సిబ్బందిచే బందోబస్తును ఏర్పాటు చేసినట్లు సీఐ, ఎస్‌ఐలు తెలియజేశారు.

ముగిసిన ఈడిగపల్లె పీర్లగుండం

వీరబల్లె : మండలంలోని ఈడిగపల్లెలో సోమవారం రాత్రి పీర్ల అగ్ని గుండం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అగ్నిగుండం తవ్వారు. అనంతరం గుండంలో భక్తులు ప్రవేశించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి మండలం నుంచే కాకుండా జిల్లా, రాష్ట్రస్థాయి నుంచి భక్తులు తరలివచ్చారు. మొక్కుబడులు ఉన్నవారు పీర్లకు బాసికాలు సమర్పించడమే కాకుండా చాందినీ బండ్లు కట్టి అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. దయ్యాల ప్రియాంక అనే మహిళ పీర్లకు రూ. 52 వేలు విలువజేసే వెండి హారం సమర్పించారు. కాలక్షేపం కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పీర్లగుండం దగ్గర ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రాఘవరాజుపురం సత్రంలో మంగళవారం పీర్ల పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మతసామరస్యానికి ప్రతీకగా హిందూ ముస్లింలు కలిసి జరుపుకునే మొహర్రం పండుగ వేడుకలు గ్రామాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రజలు జరుపుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీస్థాయిలో భక్తులు విచ్చేసి పీర్లను దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు.

పెనగలూరులో..

పెనగలూరు : మొహర్రం పండుగ సందర్భంగా మంగళవారం ఉదయం మండలంలో అనేక గ్రామాలలో అటేల్ సాహెబ్ పీర్లను ఊరేగించారు. పెనగలూరు, ఓబిలి, చక్రంపేట, నాయుడువారిపల్లి, నల్లపరెడ్డిపల్లి గ్రామాలలో పీర్ల పండుగను అత్యంత ఘనంగా నిర్వహించారు. పెనగలూరులో అటేల్ సాహెబ్, తమ్ముడు వెండి పీర్లను పురవీధులలో ఊరేగించారు. కొత్తపల్లి, ఇండ్లూరు, వినాయక నగర్, నాగిరెడ్డిపల్లి, పెనగలూరు గ్రామాలలో ఊరేగింపు నిర్వహించి పీర్ల చావిడిలో దించారు. రాత్రికి అధిక సంఖ్యలో చెక్కర, బెల్లంలను అటేస్ సాహెబ్‌కు చదివింపులు ఇచ్చి భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం తెల్లవారుజామున గుండం, సాయంత్రం పీర్లను ఏటికి పంపించడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.


గంధపు పీరుకు పూజలు చేస్తున్న సీఐ, ఎస్‌ఐలు


పెనగలూరు: మండల కేంద్రంలో అటేల్ సాహెబ్ పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం


రైల్వేకోడూరు అర్బన్ : పీర్ల గుండం వద్ద అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు


వీరబల్లె మండలం ఈడిగపల్లెలో భారీ అగ్నిగుండం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

త్యాగానికి ప్రతీక మొహర్రం

రాయచోటి (అన్నమయ్య సర్కిల్) : త్యాగానికి, మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం నిలుస్తుందని వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ధర్మ పరిరక్షణ, శాంతియుత సమాజ స్థాపన కోసం మహమ్మద్ ప్రవక్త మనుమడు హజరత్ ఇమామ్ హుస్సేన్ చేసిన ప్రాణ త్యాగం మానవాళికి దివ్య సందేశాన్ని అందిస్తుందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం పాటుపడిన ఇమామ్ జీవితం వర్తమాన సమాజానికి ఆదర్శప్రాయమన్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో విరజిల్లాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో సస్యశ్యామలంగా ఉండాలని మత సామరస్యం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శ్రీకాంత్‌రెడ్డి మొహర్రం శుభాకాంక్షలు తెలిపారు.

